క్లుప్తంగా

జోరుగా కాలువ పనులు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం 24వ వార్డు కాపువీధిలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.17 లక్షలతో నిర్మిస్తున్న మురుగు కాలువ పనులను పరిశీలించారు. గతంలో నిర్మించిన కాలువపై ఆక్రమణల తొలగింపునకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని ఆయన తెలిపారు.

రెడ్డిగుంటలో అధికారుల పర్యటన



రెడ్డి గుంటను పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర పంచాయతీలోని ప్రాచీన రెడ్డిగుంట అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు. మంత్రి రోజా ఆదేశాల మేరకు ఎంపీడీవో వేణు, ఉపాధి ఏపీవో ఇందుమతి బుధవారం రెడ్డిగుంటను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంత, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, వార్డు మెంబరు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు శ్మశానానికి దారి ఏర్పాటు



జేసీబీతో దారి ఏర్పాటు చేస్తున్న స్థానికులు

విజయపురం : మండలంలోని మల్లారెడ్డికండ్రిగ ఆదిఆంధ్రవాడ శ్మశానానికి ఎట్టకేలకు దారి ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా శ్మశానానికి దారి లేకపోవడంతో ఆదిఆంధ్రవాడ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఒక రైతు కొంత స్థలం ఇవ్వడంతో దారి సమస్య తీరింది. స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరులో ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక ఆస్పత్రిలో బుధవారం గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వితరణతో ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రులకు పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. గర్భిణులతోపాటు వారి సహాయకులకు యధావిధిగా విజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటి పండు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌నరేన్, ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు నారాయణస్వామి, పుష్పమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బుజ్జి, కడియాలనాయుడు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు



ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి : మున్సిపాలిటీ పరిధిలోని కళింమిట్ట సచివాలయంలో బుధవారం ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్త ఆధార్ కార్డులు తీసుకోవడం తదితరాలను ఇక్కడ చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆధార్‌లో మార్పుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ప్రజలు సచివాలయంలోనే ఆధార్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

వెదురుకుప్పం: ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వివిధ వాహనాలను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

సవాళ్లను ఎదుర్కోలేకే వికృత చేష్టలు



లోకేష్, భానుప్రకాష్ ఫ్లెక్సీలను పొరకలు, చెప్పులతో కొడుతున్న మహిళలు



ఫ్లెక్సీలు కాలుస్తున్న మహిళా నేతలు, పార్టీ నాయకులు

- వైఎస్సార్ సీపీ మహిళా నేతల ఆగ్రహం
- లోకేష్, భానుప్రకాష్ ఫ్లెక్సీల దహనం

నగరి : మంత్రి రోజా సవాళ్లను ఎదుర్కోలేకే టీడీపీ నేతలు వికృత చేష్టలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ మహిళా నేతలు మండిపడ్డారు. మంత్రి ఆర్కేరోజా ఇంటి వద్ద మంగళవారం టీడీపీ మహిళలు, నాయకులు చేసిన రాద్ధాంతంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టవర్ క్లాక్ సెంటర్‌లో నారా లోకేష్, నగరి ఇన్‌చార్జి భానుప్రకాష్ ఫ్లెక్సీలను దహనం చేశారు. వారు మాట్లాడుతూ పుత్తూరు సభలో లోకేష్ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఆర్కేరోజా హుందాగా ఖండించారని తెలిపారు. అంతేగాక ఇద్దరి ఆస్తులపై సీబీఐ విచారణ కోరుకుందామని సవాల్ విసిరారని పేర్కొన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో నెరవేర్చిన హామీలు, వైఎస్సార్ సీపీ నెరవేర్చిన హామీలపై ప్రజల వద్ద తేల్చుకుందామని మంత్రి పిలుపునిచ్చారని వెల్లడించారు. దమ్ము, ధైర్యం ఉంటే సవాల్‌ను స్వీకరించాలని, ఆడవారితో ఇంటికి చీరలు పంపించి వెనకవైపు నుంచి ఇంటిలోకి అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నించడం, రాద్ధాంతం చేయడం లాంటి వికృత చేష్టలు టీడీపీ నాయకుల అసమర్థతకు నిదర్శనమన్నారు. తాము తలుచుకుంటే ఆ పార్టీ నాయకులకు ప్రతి ప్రాంతంలోనూ చీరలు అందజేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నగరిలో ఇప్పటి వరకు ఎవరిపైనా రాజకీయ కేసులు పెట్టకపోవడమే మంత్రి ఆర్కేరోజా మంచితనానికి నిదర్శనమన్నారు. అలాంటి నాయకురాలి ఇంటిపైకి గొడవలకు వెళితే పార్టీ నాయకులు, కార్యకర్తలు చేతులు కట్టుకుని కూర్చోరని స్పష్టం చేశారు. ఇక ఇలాంటి చర్యలు పునరావృతమైతే గట్టిగా సమాధానం చెబుతామని హెచ్చరించారు. కరోనా సమయంలో ప్రజలు కష్టాలు పడుతుంటే దాక్కున్న టీడీపీ నాయకుడు భానుప్రకాస్ ప్రస్తుతం చావులు వెతుక్కుంటూ వెళ్లి మొసలి కన్నీళ్లు కారుస్తున్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, పార్టీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శి మేరి, కౌన్సిలర్లు జ్యోతి, సాయి సంధ్యారాణి, చినపాప, సదాశివకోన బోర్డు మెంబరు కమల, సర్పంచ్ శ్రీవిద్య, ఎంపీటీసీ జ్యోతి, శశి, తేన్‌మొళి, మున్సిపల్ చైర్‌పర్సన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్లతో సాంకేతిక విప్లవం

కార్వేటినగరం: ప్రపంచం సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి కంప్యూటర్లు నాంది పలికాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ దినోత్సవాన్ని కంప్యూటర్ విభాగాధిపతి లావణ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరి/జ్ఞానం తప్పనిసరిగా మారిందని, కంప్యూటర్లతో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. టెక్నాలజీ పుణ్యమా అని ప్రపంచమే ఒక కుగ్రామమైందని, ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లోనే తెలుసుకోగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి మోహన్‌కృష్ణ అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులతో డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యాపకులు

కార్వేటినగరం: ఉన్నత లక్షంతో ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు డిగ్రీ కళాశాలలో చేరడానికి ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, ఉన్నత బోధన విధానాన్ని ఇంటర్ విద్యార్థులకు ప్రిన్సిపల్ వివరించారు. అలాగే డిజిటల్ క్లాస్‌రూం, విద్యార్థుల సెమినార్స్, ఎన్ఎస్ఎస్, జేకేసీ ద్వారా ఉపాధి అవకాశాలు, ఇంటర్‌నెట్ కలిగిన కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం, ఇంటర్న్‌షిప్, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన.. గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు, జేకేసీ మెంటర్ లోకేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపస్ నూతన కార్యవర్గం ఎంపిక



ప్రకాష్



తులసీరామ్

నగరి : మున్సిపాలిటీ పరిధిలోని చింతలపట్టెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆపస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎంవీ ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.తులసీరామ్, గౌరవ అధ్యక్షుడిగా సిద్ధయ్య, ఉపాధ్యక్షులుగా మురుగప్ప, టి.రాజేంద్ర బాబు, కార్యదర్శులుగా సదాశివం, హేమంత్, కోశాధికారిగా లోకేష్, క్రీడా కన్వీనర్‌గా వెంకటేశులు, మహిళా కార్యదర్శులుగా దుర్గ, స్వప్నప్రియ, కళ్యాణి, అనురాధ, సాంస్కృతిక కార్యదర్శిగా త్రిపుర సుందరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు దొరస్వామి, గౌరవ అధ్యక్షులు మేకల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాలకు సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

శ్రీరంగరాజపురం: అగ్ని బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని పూల్లూరు ఎస్టీ కాలనీలో షార్ట్ సర్క్యూట్ సంభవించి గోవిందయ్య, అంకయ్యల పూరిగుడిసెలు బూడిదయ్యాయి. ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.5వేలను మంజూరు చేయడంతో బాధితులకు జెడ్పీటీసీ సభ్యుడు అందజేసి మాట్లాడారు. అలాగే బాధి కుటుంబాలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. మరో రూ.90వేల చొప్పున ఆర్థిక సాయం కూడా ప్రభుత్వం అందజేయనుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రశేఖర, తహసీల్దార్ షబ్బీర్ బాషా, ఎంపీడీఓ క్రిష్ణయ్య, ఎంఈఓ అరుణాచలం రెడ్డి, ఆర్ఐ త్యాగరాజ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం : మండలంలో రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బాబు ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్షించారు. స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నపాటి సమస్యలతో కార్యాలయాల చుట్టూ గ్రామీణులు ప్రదక్షిణలు చేసే పరిస్థితి ఉండరాదన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాలకు శ్మశానం, రోడ్డు వసతి కల్పనపై దృష్టి సారించాలన్నారు. రీ సర్వే పారదర్శకంగా చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, సర్వేయర్ కిరణ్ కుమార్, వీఆర్ఓ తంగరాజ్, శ్రీనివాసులు, రమణయ్య, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పుత్తూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 5 పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ రోశయ్య, మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి పరిశీలించారు. వీటిలో ఒకటి ఉపాధ్యాయులకు, 4 పట్టభద్రులకు కేటాయించినట్లు తహసీల్దార్ తెలిపారు. పుత్తూరు పట్టణ, రూరల్ పరిధిలో ప్రస్తుతానికి ఉపాధ్యాయ ఓటర్లు 315 మంది ఉండగా, పట్టభద్రులు 2,837 మంది ఉన్నట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా బోధన

–డీవైఈఓ చంద్రశేఖర్



రికార్డులను పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

పెనుమూరు (కార్వేటినగరం): పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని గుడ్యానంపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తోందని నమ్మకం కలిగేలా బోధన చేయాలన్నారు. అలాగే జగనన్న గోరుముద్దలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని ఆదేశించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న సంఘం కార్యదర్శి రవిచంద్ర

పుత్తూరు రూరల్: సచివాలయ సిబ్బందికి యాప్‌ల వినియోగంపై శిక్షణ ఇవ్వాలని ఏపీజీఈఏ కార్యదర్శి రవిచంద్ర కోరారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పుత్తూరు తాలూకా యూనియన్ సమావేశం బుధవారం పుత్తూరులో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల డీఏ జీవోలు ఆలస్యం లేకుండా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు చంద్రశేఖర్, ఎస్‌టీయూ అధ్యక్షులు రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు రోజారమణి, కార్యదర్శి వాణి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ ముఖ్యం



వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న విస్తరణాధికారి రమేష్

పాలసముద్రం : చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శద్ధ వహించి పంచాయతీ ఆదాయం పెంపునకు కృషి చేయాలని మండలవిస్తరణాధికారి రమేష్ సూచించారు. బుధవారం ఆయన పాలసముద్రం, ఆముదాల, బాలక్రిష్ణాపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తరలించాలన్నారు. వీటితో తయారు చేసిన వర్మీ కంపోస్టును రైతులకు తక్కువ ధరకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పక్కా రికార్డులు ఇవ్వడానికే సర్వే



మాట్లాడుతున్న కమిషనర్, చైర్మన్

నగరి : మున్సిపాలిటీలో నివశించే వారి ఆస్తులకు పక్కా రికార్డులు ఇవ్వడానికే జగనన్న భూ సర్వే కార్యక్రమం చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం సచివాలయ సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. స్థానికులు భయాందోళనకు గురవ్వకుండా వారికి సర్వే వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ సర్వేకు వెళ్లే సిబ్బంది స్థానికులతో మమేకం కావాలన్నారు. సర్వే ఫలితాలను ప్రజలకు వివరించి సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శేఖర్, రెవెన్యూ ఆఫీసర్ పి.శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: స్థానిక ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ లత ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా? అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రాప్‌లోన్ ఉందని డ్వాక్రా రుణం ఇవ్వరట!

వెదురుకుప్పం: తన భర్త క్రాప్ లోన్ తీసుకున్నాడనే నెపంతో డ్వాక్రా డబ్బులు ఇవ్వడం లేదని దేవరగుడిపల్లెకు చెందిన చిట్టెమ్మ విలేకరులకు తన గోడు చెప్పుకొంది. ఆమె కథనం..చిట్టెమ్మ జయలలిత స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉంది. ఆమెకు దేవళంపేట ఇండియన్ బ్యాంక్‌లో రూ. 70 వేలు రుణం మంజూరైంది. ఆ సొమ్మును ఇవ్వాలని ఆమె బ్యాంకర్‌ను సంప్రదించింది. అయితే చిట్టెమ్మ భర్త పొందిన క్రాప్‌లోన్‌ను చెల్లిస్తే..డ్వాక్రా రుణం సొమ్ము ఇస్తామంటూ మెలిక పెట్టడంతో ఆమె హతాశురాలైంది. రుణాన్ని కంతుల వారీగా చెల్లిస్తామని చెప్పినా అంగీకరించకపోవడంతో సమస్యను వెలుగు ఏపీఎం కవిత దృష్టికి తీసుకెళ్లింది. తనకు న్యాయం చేయాలని కోరినా ఫలితం శూన్యం. పైగా తన ఖాతాను హోల్డ్‌లో పెట్టారని, దేవళంపేట బ్యాంకు మేనేజర్‌పై గతంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పింది. ఉన్నతాధికారులైనా తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

మున్సిపల్ చైర్మన్ హరికి పరామర్శ



హరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: మున్సిపల్ చైర్మన్ ఏ.హరిని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి బుధవారం పరామర్శించారు. హరి తల్లి ఆనంగి మునెమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం కర్మక్రియలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కుమారస్వామిరెడ్డి మాట్లాడుతూ ఇంటి పెద్దను కోల్పోయినప్పుడు మనోధైర్యంతో ముందడుగు వేయాలని చెప్పారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

అవయవ దానంతో పునర్జన్మ



మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

తిరుపతి తుడా: అవయవాల దానంతో మరి కొందరికి పునర్జన్మను అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బ్రెయిన్‌డెడ్ అయిన వారి గుండె, కిడ్నీ, లివర్, కళ్లు, లంగ్స్ తదితర అవయవాలను దానం చేయవచ్చన్నారు. వాటిని మరొకరికి అమర్చడం ద్వారా పునర్జన్మ ఇవ్వవచ్చని పేర్కొన్నారు. అవయవదానం చేయాలనుకునే వారు జీవన్‌దాన్ వెబ్‌సైట్ లో నమోదు చేయవచ్చని, లేదా 9133852000ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. వైజాగ్‌లో ఇటీవల మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవదానపం చేశారని తెలిపారు. ఆమె గుండెను తిరుపతిలోని 16 ఏళ్ల బాలుడికి విజయవంతంగా అమర్చినట్టు వివరించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ఎస్వీ మెడికల్ కళాశాల జీవన్‌దాన్ కోఆర్డినేటర్ నాగమునీంద్రుడు పాల్గొన్నారు.

నేడు కల్యాణ మండపం ప్రారంభం

నారాయణవనం: ఆధునికీకరించిన అవధూత సారకాయలస్వామి ఆలయ అనుబంధ కల్యాణ మండపాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. కల్యాణ మండపంలో వాస్తు, గ్రహ శాంతి హోమాలు చేయనున్నట్టు పేర్కొంది.

శివరాత్రికి 13 స్పెషల్ సర్వీసులు

సత్యవేడు: శివరాత్రికి సత్యవేడు డిపోనుంచి 13 స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు డీఎం వెంకటరమణ తెలిపారు. సురుటుపల్లె, రామగిరి, కైలాసకోన, సదాశివ కోనకు 9 సర్వీసులు, వరదయ్యపాళెం నుంచి సిద్ధలయ్యకోనకు 3 బస్సులు, శ్రీకాళహస్తికి 9 సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి మాలల ఊరేగింపు



తిరుపతి గోవిందరాజస్వామి వారి ఆలయం నుంచి అంబారిపై బయలుదేరిన పూలమాలలు

చంద్రగిరి: కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై విహరించారు. ఉదయం తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలోని ఆండాళ్ అమ్మవారి ఆలయం నుంచి స్వామి వారికి ప్రత్యేకంగా తయారు చేయించిన పూల మాలలను సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు గోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన గోదాదేవి యాత్ర ఎస్వీ గో సంరక్షణశాల, తాటితోపు, పెరుమాళ్లపల్లి మీదుగా శ్రీనివాసమంగాపురానికి 11.30 గంటలకు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి వైఖానస ఆగమోక్తంగా మాలలను స్వామి వారి మూలవిరాట్‌కు అలంకరించారు. రాత్రి జరిగిన గరుడ సేవలో శ్రీవారికి ఈ మాలలను అలంకరించడంతో స్వామి వారు శోభాయమానంగా వెలిగిపోతూ భక్తులకు అభయమిచ్చారు.

అధికార నందిపై ఆదిదేవుని కటాక్షం



అధికార నంది వాహనంపై విహరిస్తున్న బోళాశంకరుడు, పల్లకిలో పార్వతీదేవి



వాహన సేవలో ఉభయదారులు, అర్చకులు, గ్రామ పెద్దలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లెలోని సర్వమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి ఆదిదేవుడైన వాల్మీకేశ్వర స్వామి అధికార నంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో కొలువుదీరిన స్వయంభు వాల్మీకేశ్వరస్వామి, మరగదాంబిగ తాయారు, పళ్లికొండేశ్వరస్వామి, రామలింగేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తికి వివిధ పుష్పాలంకరణ, ప్రత్యేక అభిషేకం చేశారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్స మూర్తులను పట్టుపీతాంబరాలు గజ పుష్పమాలలు, విశేషాభరణాలతో అలంకరించి అధికార వాహనంపై వాల్మీకేశ్వర స్వామి, పల్లకిలో పార్వతీదేవి అధిష్టించి పురవీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఊరేగింపు ముందు చిన్నారుల కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఉభయదారులుగా ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.ఏర్పాట్లను ఆలయ చైర్మన్, ఈఓ రామచంద్రా రెడ్డి, బోర్డు సభ్యులు ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.